ఆటో దిగి సూట్‌కేస్ పట్టుకొని చకచకా గేటుతీసి నడిచివస్తున్న పద్మజని చూసి బియ్యంలో రాళ్ళేరుతున్న కాంతమ్మగారు చేట పక్కనపెట్టి కూతురుకి ఎదురెళ్ళారు. సూట్‌కేస్ అందుకుని-

## కథ

# కనువిప్పు

“ఇదేమిటే..ఇంత సడన్‌గా వచ్చేసావు ఉత్తరం ముక్కయినా వ్రాయకుండా. మీ అత్తగారు, ఆడబడుచు, మీ మరిది, మీ ఆయన అందరూ బాగున్నారా?” అంటూ వీధిలోనే ప్రశ్నల వర్షం కురిపించారు. లోపల చిరాకుగా ఉన్నా “అందరూ బాగానే ఉన్నారు” అని ముభావంగా సమాధానం చెప్పింది. “అమ్మాయ్..లలితా ఎవరొచ్చారో చూడు” అంటూ కోడల్ని కేకేసారు.

వంటింట్లో ఉన్న లలిత చీర సవరించుకుంటూ హాల్లోకి వస్తూనే పద్మజని చూసి “అరె..నువ్వా పద్మా! అన్నయ్యేరి” అంది వీధిలోకి చూస్తూ. “నేను ఒక్కర్తినే వచ్చాను” అని ముక్తసరిగా చెప్పి సోఫాలో కూర్చుంది.

“అన్నయ్యెందుకు రాలేదు?” పద్మ ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ అడిగింది లలిత.

ఆ మాటకి పద్మకి ఒళ్ళు మండినట్లయింది. కోపంతో “ఏం ఇద్దరూ కలిసే రావాలా? ఒక్కర్తినే రాకూడదా?” అంది.

పద్మ ముఖంలో ఏదో మార్పు కనబడుతుంది. చాలా ఆవేశంలో ఉన్నట్లుంది.

ఒంటిగంట అవుతుండగా శ్రీహరి వచ్చాడు.

**“ఏమండీ! పద్మ ఇంకా మనింట్లో ఎన్నాళ్ళుంటుంది? మాటిమాటికి వచ్చేసి నెలల తరబడి తిష్టవేయడం ఏమీ బాగోలేదు. పెట్టెతోనే దిగింది. ఎన్నాళ్ళుందామనో? పైగా వచ్చిన దగ్గరనుంచి అదోలా ఉంటుంది. వరస చూస్తుంటే ఇప్పట్లో వెళ్ళేలా లేదు. ఏదో ఇన్నాళ్ళు బాగానే చూసాం. రోజురోజుకి నాకూ చిరాకేస్తోంది” విసుక్కొంది లలిత.**

చెల్లెల్ని చూస్తూనే కనుబొమలెగరేసాడు. “హాయ్ పద్మూ! ఎప్పుడొచ్చావు? బావగారేరి?” చుట్టూ చూస్తూ అన్నాడు. అంతే పద్మకి చిర్రెత్తుకొచ్చింది.

“వచ్చిన దగ్గరనుంచి చూస్తున్నాను. ఎదురుగా కనిపిస్తున్న నన్ను ఎలా ఉన్నావని అడగకుండా రానివాళ్ళనడుగుతావేంటి?” అంటూ తన కోపం అంతా అన్నగారి మీద చూపించింది.

శ్రీహరి మాత్రం మామూలుగానే “ఎలా ఉన్నదీ కనిపిస్తున్నావు కదా! ఇంక నిన్నేం అడుగుతాను. ఇంతకీ మీ అత్తగారు, ప్రసాద్ అందరూ బాగున్నారా?” అన్నాడు షూస్ విప్పుకుంటూ.

“ఆ..వాళ్ళకేం దివ్యంగా ఉన్నారు. నా రాతే బాగోలేదు” రోషంగా అని అక్కడనుంచి లోపలికి వెళ్ళిపోయింది. శ్రీహరి కూడా భోజనం చేసి కాలేజీకి బయలుదేరుతుండగా లలిత అంది. “ఎందుకో పద్మ వచ్చిన దగ్గరనుంచి చాలా కోపంగా ఉంది” అని.

“సర్లే ఈరోజుకి దాని జోలికి పోకండి, రేపు చూద్దాం” అని కాలేజీకి వెళ్ళిపోయాడు.

★★★

కాలేజీకి వెళ్ళిన శ్రీహరి లెసన్ చెబుతూంటే ప్యూన్ వచ్చి ఒక కవరు తెచ్చి ఇచ్చాడు. లెసన్ చెప్పడం ఆపి కవరు చింపి చదవసాగాడు.

“డియర్ శ్రీహరికి!

ప్రసాద్ వ్రాయునది. ఉభయకుశలోపరి. మీ చెల్లెలు మీ ఇంటికి వచ్చేయడానికి కంగారుపడుతుంది. బహుశా నీకీ లెటరు అందేసరికి మీ చెల్లెలు నీదగ్గరకి వచ్చినా రావచ్చు. దయచేసి ఈ లెటరు అందిన వెంటనే ఒకసారి బందరు రా. నీతో చాలా విషయాలు మాట్లాడాలి. ఉంటాను.

ఇట్లు
నీ
ప్రసాద్”

లెటరు చదివిన శ్రీహరికి బుర్ర ఏమీ పనిచెయ్యలేదు. ఏమిటి? ఎన్నడూ లేనిది ప్రసాద్ ఇలా లెటరు రాసాడు? పద్మ ఎందుకు వచ్చినట్లు? టైము చూసాడు. రెండున్నర, మూడుగంటలకి బందరు బస్సు ఉంది అనుకుని త్వరగా మిగిలిన లెసన్ పూర్తిచేసి, పర్మిషన్ తీసుకుని బస్టాండ్‌కి వెళ్ళాడు. ఐదు గంటలు అవుతుండగా బందరు చేరుకున్నాడు. శ్రీహరి సరాసరి ప్రసాద్ పనిచేసే కాలేజీకి వెళ్ళాడు.

అప్పుడే కాలేజీ గేటుదాటి బయటకి వస్తున్న ప్రసాద్ కనిపించాడు.

“పద్మ క్షేమంగా చేరుకుందా?” ప్రసాద్ దగ్గరకి వస్తూనే అడిగాడు.

“ఆ..” అని మాత్రం అన్నాడు శ్రీహరి. పొద దగ్గర చతికిల పడ్డారు.

శ్రీహరే కదిపాడు. “రమ్మని లెటరు రాసావు” ప్రసాద్‌ని చూస్తూ అన్నాడు.

ప్రసాద్‌కి ఎలా మొదలుపెట్టాలో అర్థంకాక క్షణం మౌనంగా వూరుకున్నాడు. తరువాత “హరీ! చిన్నప్పటి నుంచి కలిసి చదువుకుంటూ ప్రాణంగా ఉన్న మన స్నేహబంధాన్ని బంధుత్వంగా మార్చావు నువ్వు. నీ చెల్లెల్ని నాకిచ్చి పెళ్ళి చేశావు. కాని పద్మమాత్రం తన గొంతు కోసినట్లుగా బాధపడుతుంది.”

ప్రసాద్ మాటలకి ఖంగుతిన్నాడు శ్రీహరి.

“అనారోగ్యంతో ఉన్న మా అమ్మను చీదరించుకోవడం, ఆవిడ రోగం ఎక్కడ అంటుకుంటుందోనని అంటరానిదానిలా చూడటం, అదలా ఉంచు, మా చెల్లెలు శాంత పెళ్ళయి సంవత్సరం కాకముందే పసుపు కుంకాలకి దూరం అయింది. ఆ సంగతి నీకు తెలుసు. భర్త పోయిన దుఃఖంలో ఎన్నోసార్లు ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేసింది. దాన్ని పట్టుకుని ఇంకా మనింట్లో ఎన్నాళ్ళుంటుంది? ఉద్యోగం ఏదైనా చేసుకోవచ్చుకదా! సాయంగా మీ అమ్మగార్ని కూడా తీసుకెళ్ళమనండి. మీ తమ్ముడిని ఇంకా ఎన్నాళ్ళు పోషించాలి? మనకేమిటి ఈ ఖర్మ? అందరూ అన్నీ అమర్చుకుంటున్నారు. మనకి మాత్రం వీళ్ళని పోషించడంతో సరిపోతుంది. ఇలాగయితే నేను ఈ ఇంట్లో ఉండలేనని పోట్లాడి చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయింది. వేరే కాపురం పెడితేనే నాతో ఉంటుందట. నీవు నన్ను అపార్థం చేసుకోవచ్చు. విషయం చెప్పడం నా ధర్మం కాబట్టి నీకు చెబుతున్నాను. హరీ! ఇందులో నా తప్పు ఏమయినా ఉందా?” తప్పు చేసినవాడిలా ప్రశ్నిస్తున్న ప్రసాద్ గొప్పతనాన్ని, సంస్కారాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు శ్రీహరి.

“సారీ! అయామ్ వెరీ వెరీ సారీ. నా చెల్లెలు చేసిన దానికి నేను క్షమాపణ కోరుతున్నాను” అంటూ ప్రసాద్ చేతులు పట్టుకున్నాడు.


ఇద్దరూ నడుచుకుంటూ కాంప్లెక్స్‌కి వచ్చేసరికి బస్సు రెడీగా ప్లాట్‌ఫాం మీద ఉంది. బస్సులో కూర్చున్నాక “పద్మని త్వరలో పంపుతాను” అన్నాడు హరి.

“ఆమెకి ఇష్టం లేకుండా పంపద్దు” మామూలుగానే అన్నా ప్రసాద్ చేతిని మెత్తగా నొక్కి “అన్నీ తెలుసుకున్నాకే పంపుతా” అన్నాడు వేడుకోలుగా.

★★★

ఆరోజు ఉదయం నుంచి కాంతమ్మగార్కి కొంచెం నలతగా ఉంది. అప్పుడే నిద్రలేచిన పద్మ తల్లి లేవకపోవడంతో వచ్చి చూసింది. కాంతమ్మ మూల్గుతుని, “ఏమ్మా! ఏమయింది?” గాబరాగా అడిగింది.

“అబ్బ! ఏం చెప్పనే తల్లీ, ప్రొద్దుట నుంచి ఒకటే



విరోచనాలు. అబ్బా..” ఇంకా మూల్గుతూనే ఉందావిడ.

పద్మ వంటింట్లోకి వెళ్ళి “వదినా..అమ్మని వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి” అంది కంగారుగా.

“ఏంటి పద్మా! నీ కంగారు మరీనూ. ఈమాత్రందానికి డాక్టర్ దగ్గరకి ఎందుకు? అదే తగ్గిపోతుంది. అయినా ప్రతిదానికీ డాక్టర్ దగ్గరకి వెళ్ళాలంటే ఇంట్లో డబ్బు మూల్గుతుందా?” అంటూ చిన్న విషయంగా తీసిపారేసింది లలిత. పద్మ తెల్లబోయింది. సాయంత్రం నాలుగ్గంటలు అవుతుండగా లలిత కుర్చీలో కూర్చుని నవల చదువుకుంటున్న పద్మ దగ్గరకి వచ్చి-

“పద్మా! కాస్త టీ పెట్టు. అలాగే వంట కూడా చేసెయ్యి. నేను పేరంటానికి వెళ్ళాలి” అని బాత్రూమ్‌లోకి వెళ్ళిపోయింది.

పద్మ అవాక్కయిపోయింది. ఉదయం అన్నయ్య కాలేజీకి వెళుతూ “నువ్వు, పద్మ ఇద్దరూ వెళ్ళండని” అన్నయ్య చెప్పడం తను వింది. కాని వదిన తనని పిలవనైనా లేదు. పైగా వంట పని కూడా పురమాయించింది. ఉడుకుమోత్తనంతో వచ్చిన కన్నీళ్ళని బలవంతాన ఆపుకుని వంటింట్లోకి వెళ్ళింది.

బాబీ స్కూలు నుంచి వచ్చాడు. “రారా కన్నా! ఈరోజు నిన్ను ముద్దాడనే లేదు” అంటూ మనవడిని దగ్గరకి తీసుకున్నారు శాంతమ్మ. అప్పుడే హాల్లోకి వచ్చిన లలిత చిరాకుగా “ఏంటత్తయ్యా! ఉదయం నుంచి స్నానం కూడా చెయ్యలేదు. అలాగే వాడిని ముద్దు పెట్టేసుకుంటారా?” అంటూ “పోయి అత్తచేత స్నానం చేయించుకో” అని బాబీతో చెబుతూ, “వెధవ, రమ్మనగానే వెళ్ళిపోవడమే. శుచి, శుభ్రం లేదు” అని లలిత విసుక్కోవడం, అది చూసి తల్లి చిన్నబుచ్చుకోవడం అంతా వంటగదిలోంచి గమనిస్తూనే ఉంది పద్మ.

★★★

రాత్రి తొమ్మిది గంటలు అయ్యాక అందరూ భోజనాలు చేశాక తల్లికి, తనకి హాల్లో పక్కలు వేస్తున్న పద్మకి బెడ్‌రూమ్‌లో అన్నావదినల మాటలు వినబడకపోలేదు.

**బి.సాయిలక్ష్మి**

“ఏమండీ! పద్మ ఇంకా మనింట్లో ఎన్నాళ్ళుంటుంది? మాటిమాటికి వచ్చేసి నెలల తరబడి తిష్టవేయడం ఏమీ బాగోలేదు. పెట్టెతోనే దిగింది. ఎన్నాళ్ళుందామనో? పైగా వచ్చిన దగ్గరనుంచి అదోలా ఉంటుంది. వరస చూస్తుంటే ఇప్పట్లో వెళ్ళేలా లేదు. ఏదో ఇన్నాళ్ళు బాగానే చూసాం. రోజురోజుకి నాకూ చిరాకేస్తోంది” విసుక్కుంది లలిత. “తనకి ఎన్నాళ్ళు ఇష్టమయితే అన్నాళ్ళు ఉండనీ, ఏమయింది” శాంతంగా అన్నాడు శ్రీహరి.

“బాగుందండీ వరస, ఏదో చుట్టంచూపుగా వచ్చి వెళ్తే బాగుంటుందిగాని, పెట్టెలతో దిగిపోతే ఎన్నాళ్ళని భరిస్తాం? మన ప్రాణానికి మీ అమ్మగారు ఉన్నారు చాలదూ, ఆవిడతోనే ఛస్తున్నాం. మీ నాన్నగారి సంపాదన ఇక్కడేమీ లేదు, అస్తమానం రాకపోకలు సాగించడానికి మనిల్లేమన్నా సత్రవా? సంక్రాంతికని వచ్చి నెలరోజులుండి వెళ్ళింది. నెల తిరగలేదు మళ్ళీ తయారు, సిగ్గు లేకపోతే సరి. ఛీ..” వదిన రుసరుసలు వినిపించేసరికి

పద్మ నిలువునా నీరుకారిపోయింది. వదినకి తనపట్ల ఇంత అసహ్యం ఉన్నట్టు తెలుసుకోలేకపోయింది. తనంటే ఎంత లోకువ? తల్చుకుంటేనే భరించలేకపోతుంది. ఆ రాత్రంతా జాగరణే అయింది పద్మకి.

★★★

మరునాడు ఉదయం పద్మ ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడలేకపోయింది. మనసంతా అదోలా అయిపోయింది. లలిత ఏమీ ఎరగనట్లు మామూలుగా ఇంట్లో తిరిగేస్తున్నా, తను మాత్రం లలిత ముఖంలోకి సూటిగా చూడలేకపోయింది. శ్రీహరి కాలేజీకి బయలుదేరుతుండగా చెప్పింది. ''అన్నయ్యా! రెండుగంటల బస్సుకి నేను వెళ్ళిపోతాను'' అని.

తల దించుకుని, ''కంగారెందుకు..వెళ్ళచ్చులే'' అన్నాడు శ్రీహరి.

''లేదన్నయ్యా వెళ్ళిపోవాలి'' ఖచ్చితంగా అన్నట్లు చెప్పింది.

''నాలుగు రోజులుండచ్చు కదా..'' అన్న కాంతమ్మతో ''నన్నెవరూ ఆపకండి..నే వెళ్ళిపోవాలి'' అని లోపలికి వెళ్ళిపోతుంటే ''సరే..అయితే నేను వచ్చి కాంప్లెక్స్‌కి తీసుకువెళతాను'' అని చెప్పి శ్రీహరి కాలేజీకి వెళ్ళిపోయాడు.

ఒంటిగంటకి ఇంటికి వచ్చి భోజనం చేసి చెల్లెల్ని తీసుకుని కాంప్లెక్స్‌కి వెళ్ళాడు. బస్సు ఎక్కి కిటికీ దగ్గర కూర్చున్న పద్మతో ''వెళ్ళగానే లెటరు వ్రాయమ్మా'' అన్నాడు ప్రేమగా.

''అలాగే'' అంది. బస్సు టైం అయిందన్నట్లు డ్రైవర్ హారన్ కొట్టాడు.

''ఆ..మర్చిపోయా మీ వదిన నీకిమ్మంది'' అంటూ ఒక కవరు పద్మ చేతికందించి వీడ్కోలు చెప్పాడు. బస్సు కదిలిన తరువాత ఏమిటా అనుకుంటూ కవరు విప్పింది. ఉత్తరం. ''ఎందుకు రాసినట్లు?'' అనుకుని పక్క సీట్లో ఎవరూ లేకపోవడంతో ఫ్రీగా కూర్చుని చదవసాగింది.

''ప్రియమైన పద్మ! నీకు ఏమని రాయాలో అర్థం కావడంలేదు. వ్రాసింది చదివి క్షుణ్ణంగా అర్థం చేసుకుంటావని ఆశిస్తాను. ఎన్నడూ లేనిది వదినలో మార్పు చూసి ఆశ్చర్యం వేసిందా? ఈ వదినకి నువ్వంటే ప్రేమ లేక కాదు, నువ్వు అజ్ఞానం అనబడే అంధకారంలో ఉన్నావు. నిన్ను వెలుగులోకి తీసుకురావడానికి మేము చేసిన చిన్న ప్రయత్నమే నాలో ఈ మార్పు.

పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిన ఆడది అక్కడి వారందరిని తనవారిగా చూసుకోవాలి. అత్తగారికి రోగం వచ్చిందని విసుక్కుంటే రేపు అదే పరిస్థితి నీ తల్లికి ఎదురైతే నీలాగే నేను అసహ్యించుకుంటే నీకెలా ఉంటుంది? కాని నేను అంత కుసంస్కారిని కాదు. అత్తలో అమ్మను చూసుకునే మనస్తత్వం నాది. ఆమె కూడా నన్ను తన బిడ్డలాగే చూస్తారు. ఇక మామధ్య తగువే ఉండదు. గయ్యాళి అత్తలు-గడసరి కోడళ్ళు ఈ సమాజంలో చాలామంది ఉన్నారు. వారి ఇళ్ళలో నిత్యం కలహాలే. కారణం ఒకరినొకరు ప్రేమించుకోక, అర్థం చేసుకోక.

ఇక కుటుంబ బరువు బాధ్యతలంటావా, బాధ్యత తండ్రిది. ఆ తండ్రే లేకపోతే ఆ కుటుంబ బాధ్యత కొడుకుపై పడుతుంది. ఏం చేస్తాం? పరిస్థితుల ప్రభావం. మీ అన్నయ్యలాగే ప్రసాద్ కూడా తండ్రి ప్రేమాదరణ పొందలేని దురదృష్టవంతుడు. కనుకనే కుటుంబంలో పెద్దవాడు కాబట్టి ఆ కుటుంబ బరువు బాధ్యతలు అతను మోయాల్సివచ్చింది. తండ్రిలేని నీ విషయంలో కూడా మీ అన్నయ్య నిన్ను బరువు అని అనుకుంటే నీకు పెళ్ళయ్యేదా? నీ అచ్చట్లు ముచ్చట్లు తీరేవా? నన్ను గురించి గొప్పగా చెప్పుకుంటున్నానని నీవనుకోకపోతే ఇక్కడ నీకింకో విషయం గుర్తుచెయ్యాలి.

నా పెళ్ళయిన నాటినుంచి నిన్ను నా సొంత చెల్లెలుగానే ఎప్పుడూ చూసాను. నీ బాగోగులకి సంబంధించి ఏ విషయంలోనైనా నా పూర్తి సహకారాన్ని మీ అన్నయ్యకి అందించానేగాని, ఏనాడూ నేను విసుగు చెందలేదు. పైగా దేనికైనా మీ అన్నయ్య వెనకాడినా మనం ఇబ్బంది పడినా ఫరవాలేదు. ముందు పద్మకి అన్నివిధాల బాగుండేలా చూడండని నచ్చచెప్పేదాన్ని. భార్య సహకారం లేకుండా ఏ భర్తా సమర్థవంతంగా కుటుంబాన్ని నడపలేడు. నీ విషయంలో మీ అన్నయ్య, నిన్ను ప్రేమించడం గొప్పకాదు, కాని నేను నీలాగే ఆలోచిస్తే?

తండ్రి లేడన్న లోటు తప్ప ఏ విషయంలోనూ నీకు అణుమాత్రమైనా లోటులేకుండా నిన్ను మీ అన్నయ్య చూసారు. నా సహకారం లేకపోతే నిన్ను అలా చూడడం సాధ్యం అయ్యేదా? అలసి ఇంటికి వచ్చిన భర్తకి భార్య సేదతీర్చాలే కాని, సమస్య కాకూడదు. భార్యాభర్తలు ఇద్దరూ కుటుంబం అనే రథానికి రెండు చక్రాల లాంటివారు. రెండు చక్రాలు సవ్యంగా ఉన్నప్పుడే ఆ రథం సాఫీగా సాగుతుంది.

విధివంచితురాలయి భర్తపోయి సగం చచ్చి బ్రతుకుతున్న మీ ఆడబడుచును నీ మాటలతో, చేష్టలతో పూర్తిగా చంపకు, ఆమెకి ధైర్యం చెప్పి చేయూతనివ్వు. అమ్మలా ఆదరించే మీ అత్తగారిలో తల్లిని చూడు. తమ్ముడులాంటి మీ మరిదికి చేయూతనిచ్చి అతని భవిష్యత్తుకి సహకారాన్ని అందించు. కష్టాలు కలకాలం ఉండవు. కొన్నాళ్ళు ఓపికపడితే అన్నీ అవే సర్దుకుంటాయి.

ఒక్కరోజు నాలో కలిగిన మార్పే సహించలేని నువ్వు నీ మూర్ఖత్వంతో నీవాళ్ళను ఎంత బాధపెడుతున్నావో ఒక్కసారి ఆలోచించు. ప్రసాద్ చాలా మంచివాడు. అతని మంచితనాన్ని నీవు అలుసుగా తీసుకుంటున్నావు. మంచితనం నిండుగా ఉన్న ప్రసాద్ నిన్ను ఏమీ అనలేక, అటు తనవాళ్ళని వదులుకోలేక ఎంత క్షోభ అనుభవిస్తున్నాడో నీకు తెలుసా? అతను నీ ఖర్మకొద్దీ దొరికాడని నీ అభిప్రాయం. నిజానికి నీ అదృష్టంకొద్దీ దొరికిన ఆణిముత్యం ప్రసాద్. మనిషికి కావలసింది కేవలం డబ్బేకాదు. ప్రశాంతత, అది లేనప్పుడు ఎంత డబ్బున్నా వ్యర్థం. మనకెదురయ్యే సమస్యలు, ఒడిదుడుకులు సమర్థించుకునే సామర్థ్యం మనకుంటే ఎన్ని సమస్యలయినా ఎదుర్కోగలం.

చేసే ప్రతి పని ఆలోచించుకుని చెయ్యాలి. తొందరపాటు ఉండకూడదు. అర్థం లేని ఆవేశాలకి, మూర్ఖత్వాలకి పోయి నీ జీవితాన్ని నాశనం చేసుకోకు. ప్రతి సమస్యకి పరిష్కారం ఉన్నట్టే మనం పడే కష్టం వెనుక సుఖం కూడా ఉంటుంది. కుటుంబంలో ప్రతి ఒక్కరు ఎవరి స్వార్థం వారు చూసుకుంటే ఈరోజున ఏ మనిషికీ మరో మనిషితో సంబంధం ఉండేదికాదు. మనిషికి ధనబలం కంటే జనబలం కావాలి. అలాగే ఒంటరితనం కంటే ఐకమత్యం వలన మనం ఏదైనా సాధించవచ్చు.

ఇలా రాస్తున్నానని నామీద కోపం పెట్టుకోకు. శాంతంగా ఆలోచించు. మానవత్వం ఉన్న మనిషిగా మసలుతూ నీ జీవితాన్ని నందనవనం చేసుకో, నీ అత్తవారింట నీవు సంతోషంగా ఉంటూ మా దగ్గరకి వచ్చి నీవెన్నిరోజులున్నా మాకు సంతోషమే. కాని భర్తని కాదని పుట్టింటికి చేరే పరిస్థితి తెచ్చుకోకు. నిన్ను నువ్వు తెలుసుకుంటావని ఆశిస్తాను. మీ అందరి రాక కోసం ఎదురు చూస్తుంటాము.

ప్రేమతో మీ వదిన,

లలిత.

ఉత్తరం చదవడం ముగించి బుగ్గలపై కారుతున్న కన్నీటిని కొనగోటితో తుడుచుకుంటూ 'వదినా! నాపై నీకెంత అభిమానం, ప్రేమ, ఆపేక్ష. అందులో నూరోవంతయినా నేను నావాళ్ళ మీద చూపించలేకపోయాను. చీకట్లో కొట్టుమిట్టాడుతున్న నాకు వెలుగును చూపిన దేవతవి, అనురాగమూర్తివి. అమ్మని మరపించే నీ ప్రేమ ముందు నేనేమిటో నాకర్థమయింది. నాకు కనువిప్పు కలిగించి నన్ను మనిషిని చేసావు. ఇకనైనా మానవత్వం, బాధ్యత, సంస్కారం ఉన్న మనిషిగా జీవిస్తాను' అని మనసులో అనుకుని గట్టిగా ఊపిరి పీల్చుకుని వెనక్కి జారబడింది.★

